

# సంస్కృతి విచ్ఛిన్నాన్ని సహించం

హైదరాబాద్, మే 29 (నమస్తే తెలంగాణ): తెలంగాణ అస్థిత్వానికి, ఆత్మగౌరవానికి విఘాతం కలిగిస్తే సహించబోమని బీఆర్ఎస్ పార్టీ తేల్చిచెప్తున్నది. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వ్యవహరించాల్సిన పాలకులు వ్యక్తిగత లక్ష్యాల సాధనే పరమావధిగా పాలన సాగిస్తుంటే రాష్ట్రాన్ని సాధించిన పార్టీగా తాము ఊరుకోబోమని తెగేసి చెప్తున్నది. రాష్ట్ర సాధన ఉద్యమంలో భాగం కాని వారు, భావోద్వేగాలతో బంధాన్ని పెనవేసుకోనివారు అధికారం చేపట్టాక ఇష్టారీతిగా వ్యవహరిస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేస్తున్నది. ఉద్యమ సమయంలో సీమాంధ్రపాలకులు తెలంగాణ సంస్కృతిని ఛిన్నాభిన్నం చేసినట్టే, స్వరాష్ట్రంలోనూ అదే విధ్వంసం కొనసాగటం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేస్తున్నది. సుదీర్ఘ పోరాటాల ఫలితంగా రాష్ట్రాన్ని సాధించుకున్నామని, తమ నెత్తురులోనే ఉద్యమస్ఫూర్తి ఉన్నదన్న విషయాన్ని ప్రభుత్వం గుర్తుంచుకోవాలని హెచ్చరిస్తున్నది. అధికారం ఎప్పుడూ శాశ్వతం కాదన్న విషయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించాలని హితవు చెప్తున్నది. తాజాగా రేవంత్ సర్కారు ప్రజావ్యతిరేక దిశగా అడుగులు వేస్తున్నదని, బాధ్యతాయుత ప్రతిపక్షంగా తాము ప్రజల పక్షాన ఉంటామని స్పష్టం చేస్తున్నది.

## తెలంగాణ అస్థిత్వాన్ని విఘాతపరిస్తే ఊరుకోం

నాడు ఉమ్మడి పాలకులు.. నేడు స్వరాష్ట్ర పాలకులైనా అదే వరస

రాష్ట్ర సర్కారు తీరుపై బీఆర్ఎస్ ఆగ్రహం

### రాచరికానికి అవి ఆనవాళ్లా?

రాజముద్రను మార్చేస్తామని, కొత్తగా రూపొందించే రాజముద్రలో రాచరికపు ఆనవాళ్లు ఏవీ ఉండవని, ప్రజా ఆకాంక్షలకు ప్రతీకలు మాత్రమే ఉంటాయని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్న విషయం తెలిసిందే. సీఎం చేసిన ఈ ప్రకటన రాజకీయవర్గాల్లోనే కాకుండా సాహితీవేత్తలు, బుద్ధిజీవులు, సామాన్య ప్రజలను కలవరానికి గురిచేసింది. సీఎం వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా తప్పుబట్టారు. దేశంలో జనరంజక పాలనను అందించి సామాన్యులనే మాన్యులుగా చేసిన పాలకులు కాకతీయులు అని, అలాగే హైదరాబాద్ ఐకానిక్‌గా ఉన్న చార్మినార్‌ను రాజముద్రలోంచి తొలగిస్తున్నామనే నిర్ణయం దుర్మార్గమైన చర్య అని అభివర్ణించారు. వరంగల్‌లోని కాకతీయ కళాతోరణం, చార్మినార్ వేదికగా తమ నిరసన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు. అందులో భాగంగానే బుధవారం వరంగల్‌లో మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయభాస్కర్, నన్నపునేని నరేందర్ సహ బీఆర్ఎస్ నేతలు తమ నిరసన చేపట్టారు. తెలంగాణ చారిత్రక, సాంస్కృతిక అంశాలే కాకుండా కనీసం భౌగోళిక అంశాలు కూడా తెలియనివారు పాలకులు అయితే పరిస్థితి ఇలాగే ఉంటుందని కాంగ్రెస్ సర్కారు తీరుపై గళమెత్తారు. అలాగే గురువారం చార్మినార్ వద్ద తమ నిరసన చేపట్టనున్నారు. ప్రభుత్వం అప్పటికీ తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే ప్రజాఉద్యమాన్ని నిర్మిస్తామని హెచ్చరించింది. తెలంగాణ మహోన్నత చరితకు, మహోజ్వల వైభవానికి ఆనవాళ్లు కాకతీయులని పేర్కొంటూ 'కొందరు నిర్మిస్తుంటారు, కొందరు కూలదోస్తుంటారు. ఏకంగా జీవితాలనే కూలదోస్తారు, ఆరు దశాబ్దాలపాటు అనన్య త్యాగాలతో పోరాడి సాధించుకున్న స్వరాష్ట్రాన్నీ కూలదోస్తారు' అని కాంగ్రెస్ సర్కారు తీరుపై సాహితీలోకం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది.

### నాడు వాళ్లు... నేడు వీళ్లు

ఉమ్మడి రాష్ట్ర పాలనలో విధ్వంసానికి గురైన అనేక రంగాలు పదేండ్లలో పునరుజ్జీవనం దిశగా అడుగులు పడితే, వాటిని ఛిద్రం చేసే దిశగా రాష్ట్ర సర్కారు తీవ్ర నిర్ణయాలు తీసుకుంటున్నదని తెలంగాణ సమాజం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది. రాజకీయాలను రాజకీయంగా ఎదుర్కోవాలి కానీ, కుదుటపడుతున్న ప్రజాసమూహాలను విచ్ఛిన్నం చేయాలని చూడటం సరికాదని తెలంగాణ బుద్ధిజీవులు తప్పుపడుతున్నారు. అదే సమయంలో బీఆర్ఎస్ తక్షణ స్పందనను సాహితీవేత్తలు, చరిత్రకారులు స్వాగతిస్తున్నారు. ఉద్యమ సమయంలో తెలంగాణ ఆకాంక్షలను లేవనెత్తి స్వరాష్ట్రంలో పదేండ్లపాటు అధికారంలో ఉండి వాటిని పరిరక్షించిన బీఆర్ఎస్.. ఇప్పుడు ప్రతిపక్షంలోనూ ఉద్యమ బాధ్యతను విస్మరించకపోవటం చెప్పుకోదగిన పరిణామమని కాకతీయ విశ్వవిద్యాలయానికి చెందిన ఒక పరిశోధనా విద్యార్థి పేర్కొన్నారు.

## జూన్ 1న 10 వేల మందితో ర్యాలీ

- గన్‌పార్క్‌నుంచి ప్రారంభం
- హాజరుకానున్న కేసీఆర్
- 2న ఫొటో ఎగ్జిబిషన్
- మాజీ ఎమ్మెల్సీ కర్నె వెల్లడి

హైదరాబాద్, మే 29 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ దశాబ్ది ఉత్సవాల ముగింపు కార్యక్రమాల్లో భాగంగా జూన్ 1న సాయంత్రం పబ్లిక్ గార్డెన్‌లోని గన్‌పార్క్ అమరవీరుల స్తూపం నుంచి సెక్రటేరియట్ ఎదురుగా ఉన్న అమరజ్యోతి వరకు పది వేల మందితో కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టనున్నట్టు మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ తెలిపారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే దశాబ్ది ఉత్సవాల ముగింపు కార్యక్రమాలపై బుధవారం తెలంగాణ భవన్‌లో పలువురు నాయకులు సమావేశమై చర్చించారు. ఈ వివరాలను మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌తో కలిసి ఆయన మీడియాకు వెల్లడించారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో దశాబ్ది ముగింపు ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని, జూన్ 1న గన్‌పార్క్ అమరవీరుల స్తూపం వద్ద కేసీఆర్ నివాళులర్పిస్తారని, అనంతరం అక్కడి నుంచి ర్యాలీ తీస్తామని, వెయ్యిమంది కళాకారులు ర్యాలీలో ప్రదర్శనలు ఇస్తారని తెలిపారు. 2న తెలంగాణ భవన్‌లో జాతీయ జెండా, పార్టీ జెండాను కేసీఆర్ ఎగురవేస్తారని, అనంతరం పార్టీ ప్రతినిధులను ఉద్దేశించి ప్రసంగిస్తారని చెప్పారు. కళింగ ఫంక్షన్‌హాల్‌లో ఉద్యమయాది పేరిట ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తామన్నారు. 3న జిల్లా పార్టీ కార్యాలయాల్లో జాతీయ జెండా, పార్టీ జెండాలను జిల్లా అధ్యక్షులు ఎగురవేస్తారని, అదేరోజు దవాఖానలు, అనాథ శరణాలయాల్లో స్వీట్లు, పండ్ల పంపిణీ కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ ఎం శ్రీనివాస్‌రెడ్డి, వివిధ కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు దేవీప్రసాద్, వాసుదేవరెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, సతీశ్‌రెడ్డి, ఎంఎన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

### కాంగ్రెస్ సర్కార్‌ది సంకుచిత బుద్ధి

- కొండూరు సత్యనారాయణ

హైదరాబాద్, మే29 (నమస్తే తెలంగాణ): తెలంగాణ అధికారిక చిహ్నం నుంచి చార్మినార్, కాకతీయ కళాతోరణాన్ని తొలగించాలనుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వ సంకుచిత బుద్ధికి నిదర్శనమని ఎంబీసీ జాతీయ కన్వీనర్ కొండూరు సత్యనారాయణ ధ్వజమెత్తారు. తెలంగాణ అస్తిత్వానికి నిలువెత్తు ప్రతీకలను రాష్ట్ర చిహ్నం నుంచి తొలగించాలనుకోవడం సరికాదని తెలిపారు. హైదరాబాద్‌కు చార్మినార్ ఒక ప్రతీక అని పేర్కొన్నారు.

### వరంగల్ ప్రజాప్రతినిధులు నోరెందుకు మూస్కున్నరు?

- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



హైదరాబాద్, మే 29 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ అధికారిక చిహ్నం నుంచి కాకతీయ కళాతోరణాన్ని తీసేస్తే వరంగల్ ఉమ్మడి జిల్లా అధికార పార్టీ ప్రజాప్రతినిధులు నోరెందుకు మూసుకుంటున్నారని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ప్రశ్నించారు. వరంగల్‌కు ప్రపంచ ఖ్యాతిని తెచ్చిన చరిత్ర కాకతీయులదని, వారు నిర్మించిన గొలుసు కట్టు చెరువులు లక్షలాది మందికి ఉపయోగపడుతున్నాయని, అ లాంటి కాకతీయుల కళాతోరణాన్ని రాష్ట్ర అధికారిక చిహ్నం నుంచి ఎందుకు తొలగిస్తారని బుధవారం ఓ ప్రకటనలో ప్ర శ్నించారు. కాకతీయుల స్ఫూర్తితో పోరాడి కళాతోరణాన్ని మళ్లీ అధికారిక చిహ్నంలో పెట్టిస్తామన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత ఏర్పాటు చేసిన రాజముద్రను కాంగ్రెస్ ప్రభుత్వం మార్చడం దుర్మార్గపు చర్య అని, ఇది క్రూరమైన ఆలోచనలతో తెలంగాణ ఆత్మపై దెబ్బకొట్టడమేనని అభిప్రాయపడ్డారు.

# చిహ్నాలను తొలగిస్తే ఊరుకోం

- అవసరమైతే న్యాయపోరాటం చేస్తాం
- సాగు, నీళ్లకు కాకతీయ తోరణం గుర్తు
- వైద్యం, సంక్షేమానికి చార్మినార్ చిహ్నం
- రేవంత్‌రెడ్డి పచ్చి సమైక్యవాది
- తుపాకీతో ఉద్యమకారులను బెదిరింపు
- సమైక్యవాదులు చెప్పినట్టుగా పాలన
- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్
- వరంగల్ కీర్తి తోరణాల వద్ద నిరసన



నిరసన తెలిపేందుకు వరంగల్ కోటలోకి వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు వినోద్ తదితరులు

వరంగల్, మే 29(నమస్తేతెలంగాణ) : తెలంగాణ కళలు, చరిత్రపై వ్యతిరేకతతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ చరిత్రనే మార్చే కుట్ర చేస్తున్నారని, ఆయన పచ్చి సమైక్యవాది అని మాజీ ఎంపీ, బీఆర్ఎస్ నేత బోయినపల్లి వినోద్‌కుమార్ మండిపడ్డారు. రాష్ట్ర అధికారిక చిహ్నంలో కాకతీయ తోరణం, చార్మినార్‌ను తొలగిస్తే ఎట్టిపరిస్థితుల్లోనూ ఊరుకునేది లేదని, అవసరమైతే తాను న్యాయ పోరాటం చేస్తానని ప్రకటించారు. రేవంత్ తీసుకున్న రాష్ట్ర చిహ్నం మార్పు నిర్ణయంపై కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియాగాంధీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అధికారిక చిహ్నంలో మార్పులపై సీఎం నిర్ణయం అమల్లోకి వస్తే దేశ చిహ్నంపై మొదటి ప్రధాని నెహ్రూ తీసుకున్న నిర్ణయాన్ని మరిపించే శక్తులకు బలం చేకూరుతుందని చెప్పారు. దేశ చిహ్నం, జాతీయ జెండాలో అశోక చక్రం ఉండటం నెహ్రూ నిర్ణయమేనని, రాష్ట్ర చిహ్నంలో కాకతీయ తోరణం, చార్మినార్‌ను తొలగిస్తే రేపు దేశ చిహ్నం, జాతీయ జెండాలోని అశోక చక్రాన్ని కూడా తొలగించాలనే డిమాండ్ బలంగా వస్తుందని, ఈ నేపథ్యంలో రేవంత్‌రెడ్డి నిర్ణయాన్ని సోనియాగాంధీ అంగీకరిస్తారా? అని ప్రశ్నించారు. రాష్ట్ర చిహ్నంలో కాకతీయ తోరణం, చార్మినార్‌ను తొలగించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం సాయంత్రం ఖిలావరంగల్‌లోని కాకతీయ కీర్తి తోరణాల వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, తెలంగాణవాదులు, వరంగల్‌వాసులు భారీ సంఖ్యలో తరలివచ్చి నిరసన గళం వినిపించారు. తెలంగాణ అస్తిత్వాలైన కాకతీయతోరణం, చార్మినార్ గుర్తులను తొలగిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. స్థానిక మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వినోద్‌కుమార్ మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక ఒక్కసారి కూడా జై తెలంగాణ అనలేదని, జై సోనియాగాంధీ, జై రాహుల్‌గాంధీ అని మాత్రమే అంటున్నాడని, రేవంత్‌రెడ్డి వెనుక తెలంగాణ వ్యతిరేక శక్తులున్నాయని విమర్శించారు. కేసీఆర్ నాయకత్వంలోని పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన తెలంగాణ అభివృద్ధిని వ్యతిరేక శక్తులు ఓర్వలేకపోతున్నాయని ధ్వజమెత్తా రు. కేసీఆర్ వల్లే తెలంగాణ ఆదా యం పెరిగిందని స్పష్టంచేశారు. రేవంత్‌రెడ్డి, టీడీపీ అధినేత చంద్రబాబులది గురుశిష్యుల బంధమని, తెలంగాణ ఉద్యమ సమయంలో రేవంత్‌రెడ్డి తుపాకీ పట్టుకుని తిరుగుతూ ఉద్యమకారులను బెదిరించారని, కరీంనగర్‌లో చంద్రబాబు వెంట రేవంత్‌రెడ్డి తుపాకీ పట్టుకొని తిరిగాడని గుర్తు చేశారు. కాకతీయతోరణం వ్యవసాయం, ఇరిగేషన్‌కు చిహ్నం అని వివరించారు. నిరసనలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మాజీ ఎమ్మెల్యేలు వినయ్‌భాస్కర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు ఏనుగుల రాకేశ్ రెడ్డి, ఇండ్ల నాగేశ్వర్‌రావు, శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

### బీఆర్ఎస్ నేతలపై కేసులు

- అనుమతిలేకుండా పురావస్తు శాఖ కోటలోకి ప్రవేశం
- కోడ్ ఉల్లంఘించి ధర్నా చేసినందుకు కేసులు నమోదు

కాశీబుగ్గ, మే 29 : పురావస్తు శాఖ అనుమతి లేకుండావరంగల్ కోటలోకి ప్రవేశించడంతోపాటు ఎన్నికల కోడ్ ఉల్లంఘించి ధర్నా చేశారం టూ బీఆర్ఎస్ నాయకులపై మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో రెండు కేసులు నమోదైనట్టు సీఐ మల్లయ్య తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తయారు చేసిన చిహ్నంలో కాకతీయ తోరణం తొలగింపును వ్యతిరేకిస్తూ బుధవారం ఖిలావరంగల్ కోటలో బీఆర్ఎస్ నేతలు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎంపీ బీ వినోద్‌కుమార్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మాజీ ఎమ్మెల్యేలు నన్నపునేని నరేందర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, దాస్యం వినయ్‌భాస్కర్, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగు రాకేశ్‌రెడ్డితోపాటు పలువురు కార్పొరేటర్లు, నాయకులపై కేసులు నమోదయ్యాయి.

మరిన్ని వార్తలు ntnews.com లో చూడగలరు

### తెలంగాణ ప్రజల గుండెలను గాయపర్చడమే..



తెలంగాణ అధికారిక చిహ్నం నుంచి కాకతీయుల కళాతోరణం, చార్మినార్ చిత్రాలను తొలగించడమంటే తెలంగాణ చరిత్రను చెరిపేయడమే అవుతుంది. మూడున్నర కోట్ల తెలంగాణ ప్రజల గుండెలను కాంగ్రెస్ ప్రభుత్వం గాయపరుస్తున్నది. కాకతీయ కళాతోరణం తెలంగాణ నేలకు నిలువెత్తు రూపం. తెలంగాణ అస్తిత్వానికి నిలువెత్తు ప్రతీకలు. కాబట్టి చిహ్నాలను తొలగించకుండా పాత వాటినే కొనసాగించాలి.

- విఎన్ శేషాచార్య
తెలుగు విశ్రాంత ఉపాధ్యాయులు

### చిహ్నాలను తొలగిస్తే ఉద్యమిస్తాం..



తెలంగాణ చరిత్రలో భాగమైన ఓరుగల్లు కాకతీయుల కళాతోరణం, చార్మినార్ చిహ్నాలతో కూడిన రాష్ట్ర అధికారిక రాజముద్రనే బాగున్నది. ఇప్పుడొచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం చిహ్నాలను తొలగిస్తా మనడం భావ్యం కాదు. గత పాలకుల హయాంలో జరిగిందనే అక్కసుతోనే కొత్త నాటకం మొదలు పెట్టారు. ఈ నిర్ణయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలి. లేకపోతే తెలంగాణ ఉద్యమ తరహాలో పోరాడాల్సి వస్తుంది.

- చింత మహేశ్, తెలంగాణ ఉద్యమకారుడు

## రెండున మరో తెలంగాణ జనగీతం

- గేయరచయిత మిట్టపల్లి సురేందర్ వెల్లడి

హైదరాబాద్, మే 29 (నమస్తే తెలంగాణ): తెలంగాణలోని ప్రతి పౌరుడి మనసు ఉప్పొంగేలా జూన్ 2వ తేదీన తెలంగాణ జనగీతం ప్రజల ముందుకు వస్తున్నదని, ఇందుకు సంబంధించిన రికార్డింగ్ పూర్తయిందని గేయరచయిత మిట్టపల్లి సురేందర్ వెల్లడించారు. 'రాతి బొమ్మల్లోన కొలువైన శివుడా..' పాట తెలంగాణ ఉద్యమాన్ని ఎలా ప్రభావితం చేసిందో.. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా విడుదల కానున్న పాట కూడా తెలంగాణ సమాజపు సుప్రభాతగీతమై అలరారనున్నదని తెలిపారు. తన పాట ఒకరికి పోటీ కాదని, అలాగే ఒకరిపాట తనకూ పోటీకాదని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి సంవత్సరం ఒక కొత్తపాటను విడుదల చేయటం ఆనవాయితీగా పెట్టుకున్నానని వెల్లడించారు. 2014లో 'వచ్చిందే స్వాతంత్ర్యం..తీరిందే వనవాసం.. తెచ్చిందే కొండంత పండుగలే మనకోసం. కదిలొచ్చే కాలంతో వెల్లువలా సంతోషం.. మొలిచిందే సంతోషం పైరల్లే దరహాసం..', 2015లో 'మన గుండె గుణము..అది గునుగు వనము. అందరికీ అమ్మ ఈ భువనం.. త్యాగాల మునుము మన చరిత ఘనము..' ఇలా ప్రతి సంవత్సరం జూన్ 2న ఒక కొత్త పాటను విడుదల చేస్తున్నానని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి దశాబ్ది పూర్తి చేసుకుంటున్న తరుణంలో విడుదల కానున్న పాటకు ప్రత్యేకత ఉంటుందని తెలిపారు. ఆ పాటను పూర్తిగా తెలంగాణలో పుట్టిన తేనెతుట్టెలాంటి ఆడబిడ్డలు ఆలపించిన పాట అని పేర్కొన్నారు. తిరుమలలో శ్రీవెంకటేశ్వర సుప్రభాత గీతాన్ని ఎంఎస్ సుబ్బులక్ష్మి.. మరో ఇద్దరు భక్తిభావంతో చేసిన గాత్రానికి ఉండే మాధుర్యం ఈసారి తను విడుదల చేయనున్నపాటకు ఉంటుందని అన్నారు.

## 2న ట్యాంక్‌బండ్‌పై కార్నివాల్

హైదరాబాద్, మే 29 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో భాగంగా జూన్ 2న సాయం త్రం ట్యాంక్‌బండ్‌పై కార్నివాల్ ని ర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయని ప్రభుత్వం తెలిపింది. ఈ సం దర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు, బాణసంచా, లేజర్‌షో, ఫుడ్, గేమింగ్ స్టాళ్లను ఏర్పాటుచేస్తున్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన పలు సాంస్కృతిక కళా బృందాలతో ప్రదర్శనలు ఉంటా యి. సాంస్కృతిక కార్యక్రమాలకు ముఖ్యమంత్రి, మంత్రు లు, ఇతర ప్రముఖులు హాజరవుతా రు. ప్రధాన వేదికపై వివిధ శాస్త్రీయ, జానపద, దక్కనీ సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయి. తెలంగాణ రాష్ట్ర అధికారిక గీతమైన జయ జయహే తెలంగాణతో జాతీయ జెండాలతో మార్చ్ ఫాస్ట్ ఉండనున్నది. ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటుచేసే దాదాపు 80 స్టాళ్లలో రాష్ట్రంలోని హస్తకళలు, స్వయం సహాయక బృందాలు త యారు చేసే వస్తువులు, చేనేత ఉత్పత్తులు, నగరంలోని పలు ప్రముఖ హోటళ్ల స్టాళ్లు, గేమింగ్ షోలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.

# చరిత్రను చెరిపివేసే కుట్ర

మొదటిపేజీ తరువాయి...

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి, ప్రొఫెసర్ కోదండరాం, అద్దంకి దయాకర్, జేఏసీ నేత రఘు, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, రాంచంద్రునాయక్, గండ్ర సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే సంపత్, ఎంపీ అభ్యర్థి బలరాంనాయక్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర చిహ్నం తుది రూపుపై కళాకారుడు రుద్ర రాజేశంతో వారు చర్చలు జరిపారు. ఈ సందర్భంగా పలు డిజైన్లను సీఎం రేవంత్‌రెడ్డికి అందజేసినట్టు తెలిసింది. రాష్ట్రగీతం రూపకల్పనపై కవి అందెశ్రీ, సంగీత దర్శకుడు కీరవాణి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్కతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ సమీక్షించారు. ఈ సందర్భంగా మార్పులు చేర్పులపై చర్చించారు.

### హడావుడికే ప్రాధాన్యం?

సీఎం రేవంత్‌రెడ్డి సూచనల మేరకు రూపొందించిన పలు డిజైన్లను సమీక్ష సందర్భంగా ప్రదర్శించినట్టు తెలిసింది. ఇప్పటికే సోషల్ మీడియాలో పలు ఫొటోలు వైరల్ అవుతున్నాయి. వీటిని బట్టి రాష్ట్ర చిహ్నంలో నాలుగు సింహాల చిహ్నాన్ని కొనసాగిస్తూ.. కాకతీయ కళాతోరణం, చార్మినార్‌ను పక్కన పెట్టినట్టు తెలుస్తున్నది. వీటికి బదులుగా పూర్ణకుంభం, తంగేడు ఆకులు, హుస్సేన్‌సాగర్‌లోని గౌతమబుద్ధుడి విగ్రహం వంటివాటితో డిజైన్లను రూపొందించినట్టు తెలిసింది. దీంతోపాటు అశోకచక్రం, పరిశ్రమలను సూచించేలా అర్ధచక్రం, ఆకులతో కూడిన డిజైన్లను కూడా సిద్ధం చేసినట్టు సమాచారం. కొత్త చిహ్నంలో గన్‌పార్క్, అమరవీరుల స్తూపం ఉంటాయని కూడా చెప్తున్నారు. అయితే, సమ్మక్క-సారక్క పోరాటం, నాగోబా జాతర స్ఫూర్తిని తలపించేలా కొత్త లోగో ఉంటుందంటూ కొన్నాళ్లుగా చేస్తున్న ప్రచారం ఉత్తిదేనని సోషల్‌మీడియాలో వైరల్ అవుతున్న ఫొటోలను బట్టి స్పష్టమవుతున్నది. ప్రస్తుత చిహ్నంలో ఆకుపచ్చ, బంగారు వర్ణాలు మాత్రమే ఉన్నాయి. అందరూ కలలుగన్న బంగారు తెలంగాణను స్ఫురించేలా బయటి వృత్తం, పాడిపంటలతో పచ్చని తెలంగాణను స్ఫురించేలా లోపల ఆకుపచ్చ రంగును వినియోగించారు. అయితే, కొత్త చిహ్నాన్ని రంగురంగులతో నింపి, చూడగానే కంటికి ఇంపుగా ఉండేలా తీర్చిదిద్దినట్టు సమాచారం. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ లోగోలో 'తెలంగాణ ప్రభుత్వం' అని అర్థం వచ్చేలా తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూలో రాసి ఉండగా.. కొత్త లోగోలో హిందీని కూడా చేర్చినట్టు తెలుస్తున్నది.

### పాటలోనూ చరిత్రకు స్థానం లేదా?

రాచరికపు ఆనవాళ్లు పేరుతో 'జయ జయహే తెలంగాణ' పాటలోనూ చరిత్ర కనిపించకుండా పలు మార్పులు చేసినట్టు చర్చ జరుగుతున్నది. ఉద్యమ సమయంలో రాసిన గేయంలో 'కాకతీయ కళాప్రభల కాంతిరేఖ రామప్ప.. గోలుకొండ నవాబుల గొప్ప వెలుగే చార్మినార్' అనే చరణాలు ఉన్నాయి. ఈ రెండు చరణాలను పక్కనపెట్టేయాలని ఆదేశాలు జారీ అయ్యాయని, దీంతో వాటికి బదులుగా వేరే చరణాలు జొప్పించారని ప్రచారం జరుగుతున్నది. గతంలో వినిపించిన పాటలో సంగీతం ఉద్యమస్ఫూర్తిని రగిలించేలా, తెలంగాణ ప్రాంత భావోద్వేగాలకు అద్దం పట్టేలా ఉండగా.. కీరవాణి స్వరపరిచిన గీతంలో సంగీత వాయిద్యాల హోరుతో సినిమా పాటను తలపించేలా సాగుతున్నదనే విమర్శలు వినిపిస్తున్నాయి. బుధవారం విడుదల చేసిన సీఎం సమీక్ష ఫొటోల్లో ప్రముఖ గాయకుడు రేవంత్ ఉండటంతో, ఆయనే ఈ పాటను పాడినట్టు చర్చ జరుగుతున్నది. మొత్తంగా రాచరికపు ఆనవాళ్ల పేరుతో వందల ఏండ్ల తెలంగాణ చరిత్ర ఆనవాళ్లను చెరిపివేసే, దశాబ్దాలుగా తమకు నచ్చిన నేతల పాలనను స్ఫురించేలా రంగురంగుల చిహ్నాన్ని, గీతాన్ని రూపొందించి ప్రజలపై రుద్దాలని ప్రయత్నిస్తున్నారనే చర్చ సాగుతున్నది.





## HKR రోడ్‌వేస్ లిమిటెడ్
## హైదరాబాద్-కరీంనగర్-రామగుండం సెక్షన్ (SH-I)-తెలంగాణ

## 2024-25 & 2025-26 సంవత్సరాల కొరకు యూజర్ ఫీ (టోల్) రేట్లు సవరణ కొరకు బహిరంగ ప్రకటన

బహిరంగ ప్రకటన

1. లెటర్ నెం. 111/PPP/HKR road/PD (PPP)/DEE1/AEE5/Toll Rates/2022, తేది: 27-05-2024 ప్రకారం, R&B, తెలంగాణ రాష్ట్రం నుండి 2024-25 & 2025-26 సంవత్సరం కొరకు యూజర్ ఫీ రేట్లు యొక్క సవరణ ఆమోదాన్ని స్వీకరించిన మీదట, SH-I యొక్క కి.మీ. 28.200 నుండి కి.మీ. 235.058 వరకు (డిజైన్ పొడవు 206.178 కి.మీ.లు) (హైదరాబాద్-కరీంనగర్-రామగుండం సెక్షన్) మూడు సెక్షన్ల కొరకు దుద్దెడ (Ch#91.450), రేణికుంట (Ch#140.050) మరియు బసంత్‌నగర్ (Ch#208.100) వద్ద గల మూడు టోల్ ప్లాజాలు వద్ద దిగువ ఇవ్వబడిన విధంగా యూజర్ ఫీ రేట్లు **01-06-2024, 0:00 గం. నుండి 31-05-2026** వరకు వర్తించబడతాయని ఇందుమూలంగా సాధారణ ప్రజానీకానికి తెలియజేయడమైనది.

| క్ర. సం. | వాహనం రకం | దుద్దెడ టోల్ ప్లాజా (కి.మీ. 91.450) టోలు విధించదగు దూరం- 71.120 కి.మీ. | | | రేణికుంట టోల్ ప్లాజా (కి.మీ. 140.050) టోలు విధించదగు దూరం- 65.460 కి.మీ. | | | బసంత్‌నగర్ టోల్ ప్లాజా (కి.మీ. 208.100) టోలు విధించదగు దూరం- 69.368 కి.మీ. | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | సింగిల్ ట్రిప్ | డైలీ పాస్ | నెలవారీ పాస్ | సింగిల్ ట్రిప్ | డైలీ పాస్ | నెలవారీ పాస్ | సింగిల్ ట్రిప్ | డైలీ పాస్ | నెలవారీ పాస్ |
| 1 | కార్/ వ్యాన్/ జీప్ | 78 | 117 | 2335 | 72 | 107 | 2145 | 76 | 114 | 2275 |
| 2 | LCV/మినీ బస్ | 156 | 233 | 4665 | 143 | 215 | 4295 | 152 | 228 | 4550 |
| 3 | బస్/ట్రక్ (2 యాక్సిల్ వెహికిల్) | 311 | 467 | 9335 | 286 | 429 | 8590 | 303 | 455 | 9105 |
| 4 | MAV/HCV(>2 యాక్సిల్స్) వెహికిల్స్ | 778 | 1167 | 23330 | 716 | 1074 | 21475 | 759 | 1138 | 22755 |

2. దిగువ తెలిపిన తగ్గింపులు పైన తెలిపిన టోల్ ప్లాజాల వద్ద లభిస్తాయి:
(i) సింగిల్ ట్రిప్ చార్జీ యొక్క 1.5 సార్లు వంతున వాహనాల అన్ని కేటగిరీల కొరకు చెల్లింపు సమయం నుండి 24 గంటల లోపల డైలీ పాస్.
(ii) నెలవారీ పాస్ వాహనం యొక్క ప్రతీ కేటగిరీకి వర్తించు 30 సింగిల్ ట్రిప్స్ రేటుకు సమానమైన చార్జీల చెల్లింపుపై లభిస్తుంది.
(iii) టోల్ ప్లాజా నుండి 20 కి.మీ.ల లోపల గల వాణిజ్య వాహనం (కార్/వ్యాన్/జీప్) కొరకు కేలండర్ నెల ఒక్కంటికి రూ. 405 వంతున పాస్.
(iv) వరుసగా LCV మరియు ట్రక్ కొరకు రూ. 40 & రూ. 70 వంతున 20 కి.మీ.ల లోపల ప్రయాణించడం కొరకు రుజువు (వాహనం యొక్క బయలుదేరు ప్రదేశం మరియు గమ్య స్థానాన్ని స్పష్టంగా తెలియజేయుట కొరకు గూడ్స్ చలాన్‌తో) దాఖలు చేయుటపై స్థానిక వాణిజ్య వాహనాలు (LCV మరియు ట్రక్) కొరకు సింగిల్ ట్రిప్ కొరకు తగ్గింపు రేటు లభిస్తుంది.
3. మినహాయింపు పొందిన వాహనాలు గెజిట్ నోటిఫికేషన్ నం. 22, తేది : 20-01-2014లో తెలిపిన విధంగా ఉంటాయి.
4. పైన తెలిపిన రుసుము 20-01-2014న ప్రచురించబడిన అసాధారణ రాజపత్రములోని పార్ట్-I ప్రకారము అథారిటీచే ప్రచురించబడిన నోటిఫికేషన్ G.O.Ms నం. 4, రవాణా, రహదారులు మరియు భవనాలు (R.IV), తేది : 16-01-2014లోని సవివరమైన ప్రొసీజర్ ప్రకారం ప్రతి రెండు సంవత్సరాలకు సవరించబడుతుంది.

**HKR రోడ్‌వేస్ లిమిటెడ్, హైదరాబాద్**

అత్యవసర సమయంలో సంప్రదించవలసిన నం.లు : 9491060022 (TP1), 9491060033 (TP2), 9491060055 (TP3)